క్లుప్తంగా

గాయత్రికి జాతీయ స్థాయిలో బంగారు పతకం

వాటర్ స్పోర్ట్స్‌లో సత్తా చాటిన నాగాయలంక యువతి



నాగాయలంక: ఉత్తరాఖండ్‌లో జరుగుతున్న 38వ కెనోయ్ స్లాలమ్ నేషనల్స్ పోటీల్లో నాగాయలంకకు చెందిన వాటర్ స్పోర్ట్స్ క్రీడాకారిణి నాగిడి గాయత్రి బంగారు పతకం సాధించింది. ఉత్తరాఖండ్ రాష్ట్రం శివపురి ప్రాంతంలోని గంగానదిలో గత నెల 28న ఆరంభమైన ఈ పోటీలు ఈనెల 14వతేదీ వరకు జరుగుతాయి. ఈ పోటీల్లో ఏపీ కెనోయింగ్ కయాకింగ్ అసోసియేషన్ నేతృత్వంలో పాల్గొన్న గాయత్రి వ్యక్తిగత ఈవెంట్‌లో బంగారు పతకం పొందినట్లు అసోసియేషన్ అధ్యక్షుడు బలరామ్ నాయుడు, అడ్వయిజర్ తిప్పిరెడ్డి శివారెడ్డి బుధవారం ఫోన్ ద్వారా సమాచారం అందించారు. గాయత్రి 2023లో గోవాలో జరిగిన నేషనల్ గేమ్స్‌లో రజత పతకం సాధించింది. ప్రస్తుతం జాతీయ స్థాయిలో బంగారుపతకం సాధించిన గాయత్రిని పలువురు అభినందించారు.

పాస్టర్ల ఫెలోషిప్‌కు రూ.లక్ష వితరణ



నాగాయలంక: స్థానిక మండల పాస్టర్ల ఫెలోషిప్‌కు కోడూరు మండలానికి చెందిన టీఎస్‌ఆర్ గ్రూప్ చైర్మన్, టీఎస్‌ఆర్ మినిస్ట్రీస్ అధినేత తిరుపతి శ్రీనివాసరావు లక్ష రూపాయలు వితరణగా అందజేశారు. నాగాయలంకలోని మండల పాస్టర్ల ఫెలోషిప్ కార్యాలయంలో బుధవారం జరిగిన కార్యక్రమంలో సంఘం అధ్యక్షుడు మండలి కిరణ్‌బాబు, సభ్యులకు ఆయన రూ.లక్ష చెక్ ను అందజేశారు. కార్యక్రమంలో వాక్యోపదేశకుడు కోట కరుణకుమార్, ఫెలోషిప్ సభ్యులు, దైవసేవకులు పాల్గొన్నారు.

బాలల సత్వర చికిత్స కేంద్రం సందర్శించిన జడ్జి

మచిలీపట్నంటౌన్: ఈ నెల 10వ తేదీ నుంచి ప్రత్యేక అవసరాలు గల పిల్లలను ఇంటింటికీ తిరిగి గుర్తించే కార్యక్రమం ప్రారంభించనున్నారు. ఈ నేపథ్యంలో ఈ కార్యక్రమానికి సంబంధించిన సదుపాయాలను పరిశీలించేందుకు లోక్ అదాలత్ న్యాయమూర్తి కేవీ రామకృష్ణయ్య బుధవారం స్థానిక జిల్లా సర్వజన ఆసుపత్రిలో ఆవరణలో ఉన్న జిల్లా బాలల సత్వర చికిత్స కేంద్రాన్ని సందర్శించారు. ఈ కేంద్రంలో చిన్నారులకు అందించే వైద్య సేవల గురించి వైద్యులను, సిబ్బందిని ఆయన అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా ఎస్‌సీపీ కార్యక్రమాధికారి డాక్టర్ విజయభారతి, జిల్లా ఆర్‌బీఎస్కే కార్యక్రమాధికారి డాక్టర్ హిమబిందు, సర్వజనాసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ డి.ఆశాలత, ఆర్‌ఎంఓ డాక్టర్ నిరంజన్‌కుమార్, ఆర్‌బీఎస్కే వైద్యాధికారులు డాక్టర్ శ్వేత, డాక్టర్ శ్రీజ సిబ్బంది పాల్గొన్నారు.

గూడూరు ఖాజీగా అమానుల్లా బేగ్



గూడూరు: గూడూరు మండలం ప్రభుత్వ ఖాజీగా అమానుల్లా బేగ్ నియమితులయ్యారు. ఈ మేరకు ప్రభుత్వం నియామక ఉత్తర్వులు జారీ చేసింది. గూడూరులోని పీఏసీఎస్ రైతు కమ్యూనిటీ హాలులో బుధవారం జరిగిన కార్యక్రమంలో పెడన ఎమ్మెల్యే కాగిత కృష్ణప్రసాద్ అమానుల్లా బేగ్‌కు నియామకపత్రాన్ని అందజేశారు. కార్యక్రమంలో విజయ సూపర్ మార్కెట్ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, డీసీ చైర్మన్ పోతన వెంకటలక్ష్మీ నరసింహస్వామి తదితరులు పాల్గొన్నారు.

అతి వేగం అపాయకరం

కృత్తివెన్ను: రోడ్డుపై ప్రయాణించే సమయంలో వాహనాన్ని వేగంగా నడపడం ఎంతో ప్రమాదకరమని వేగం కంటే ప్రాణం ఎంతో విలువైనదన్న విషయాన్ని ప్రతి వాహనదారుడు గుర్తించాలని కృత్తివెన్ను ఎస్‌ఐ పైడిబాబు అన్నారు. రోడ్డు భద్రతా మాసోత్సవాలలో భాగంగా బుధవారం ఆయన స్థానిక నవజ్యోతి కళాశాలలోని విద్యార్థులకు ట్రాఫిక్ నిబంధనల గురించి వివరించారు.

సరైన సూచనలతో సాగు చేస్తే లాభాలు

కృత్తివెన్ను: మినుము సాగులో సరైన సలహాలు, సూచనలు తీసుకుని సాగుచేస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని ఏవో జెన్నీ అన్నారు. మండలంలోని కృత్తివెన్ను, యండపల్లి గ్రామాల్లో బుధవారం పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించారు. దీనిలో భాగంగా రైతులు ఆచరించాల్సిన పద్ధతులు, సాగులో తీసుకోవాల్సిన జాగ్రత్తలను వివరించారు.

దక్షిణ కాశీలో సమస్యల కొలువు

- ఈనెల 23 నుంచి మార్చి 3 వరకు మహాశివరాత్రి ఉత్సవాలు
- విరిగిపోయిన జల్లు స్నానాల పైప్‌లైన్లు
- సరిపడా లేని దుస్తులు మార్చుకునే గదులు
- పిండ ప్రదాన షెడ్డులో కూలిపోయిన బల్లలు

పెదకళ్లేపల్లి(మోపిదేవి): దక్షిణ కాశీగా పేరుగాంచిన పెదకళ్లేపల్లిలోని శ్రీ దుర్గా పార్వతీ సమేత నాగేశ్వర స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు ఈనెల 23 నుంచి మార్చి 3వ తేదీ వరకు వైభవంగా నిర్వహించనున్నారు. ఈ ఉత్సవాలకు ఈ ఏడాది దాదాపు లక్షన్నర మంది భక్తులు వస్తారని అధికారులు అంచనా వేస్తున్నారు. ఈ నేపథ్యంలో అవసరమైన ఏర్పాట్లు, వసతుల గురించి ఇటీవల మచిలీపట్నం ఆర్డీవో స్వాతి పలు శాఖల అధికారులతో పెదకళ్లేపల్లి ఆలయ ప్రాంగణంలో సమన్వయ కమిటీ సమావేశం నిర్వహించారు. పలు సూచనలు చేసి వేగంగా పనులు చేపట్టాలని నిర్దేశించారు.



సగం విరిగిపోయిన చిరుజల్లుల పైప్‌లైన్

అరకొర వసతులతో భక్తుల ఇబ్బందులు

ఇక్కడ కృష్ణానది ఉత్తర వాహినిగా ప్రవహించడంతో దక్షిణ కాశీ అనే పేరు వచ్చిందని, ఉత్తర దిశగా ప్రవహించే నదిలో పుణ్యస్నానాలు చేయడం వల్ల పాప పరిహారంతో పాటు పుణ్యప్రాప్తి లభిస్తుందని భక్తుల అచంచల విశ్వాసం. ప్రధానంగా పితృదేవతలకు పిండప్రదానం చేయడం ఇక్కడ ప్రసిద్ధి. ఇంతటి ప్రాశస్త్యం గల ఈ పుణ్యక్షేత్రంకు ప్రతి ఏడాది మహాశివరాత్రికి పెద్ద సంఖ్యలో భక్తులు తరలి వస్తారు. దానికి తగిన ఏర్పాట్లు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉంది. మహాశివరాత్రినాడు అమా వాస్య ఘడియలలో ఉదయం నదిలో పాటు వల్ల ఘాట్ల వద్ద నీరు తక్కువగా ఉండే అవకాశం ఉంటుంది. లోతుకు వెళ్లే అవకాశం ఉండదు. దీన్ని దృష్టిలో పెట్టుకుని గతంలో నది ఒడ్డున చిరుజల్లు స్నానాలకు పైప్ లైన్ ఏర్పాటు చేశారు. ప్రస్తుతం ఆ పైప్‌లైన్ సగానికి విరిగిపోయి శిథిలావస్థలో ఉంది. భక్తులు ముఖ్యంగా మహిళలు నదిలో స్నానం చేసిన అనంతరం దుస్తులు మార్చుకునేందుకు గదులు, మరుగు దొడ్లు తప్పనిసరిగా ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. పిండ ప్రదానం చేసే ప్రదేశంలో గతంలో కూర్చునేందుకు సిమెంట్ బల్లలు ఏర్పాటు చేశారు. నేడు అవి పగిలిపోయి, కూలిపోయి ఉన్నాయి. వాటి స్థానంలో కొత్త బల్లలు ఏర్పాటు చేయాలని, భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్థానికులు కోరుతున్నారు.



పిండ ప్రదాన షెడ్డులో కూలిపోయిన బల్లలు



కృష్ణానది ఒడ్డున పాడయిన మరుగుదొడ్లు

గూడూరు ఆసుపత్రిలో స్టెమీ సేవలు

- గుండెపోటు రోగులకు భరోసా
- ఉచితంగా రూ.45 వేల విలువ చేసే ఇంజక్షన్



గుండె పోటు సంభవించినప్పుడు అత్యవసరంగా ఇచ్చే ఇంజక్షన్ గురించి వివరిస్తున్న డాక్టర్ నరేంద్ర

గూడూరు: గూడూరు సామాజిక ఆరోగ్య కేంద్రంలో 'స్టెమీ –గుండెకు భరోసా' అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వచ్చినట్లు ఆసుపత్రి సూపరింటెండెంట్ వి.నరేంద్ర తెలిపారు. ఆసుపత్రిలో బుధవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో దీనికి సంబంధించిన వివరాలను ఆయన వెల్లడించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గుండెపోటు సంభవించినప్పుడు అత్యవసరంగా ఇవ్వాల్సిన అత్యంత ఖరీదైన రూ.45 వేల విలువ కలిగిన ఇంజక్షన్‌ను ప్రభుత్వం ఆసుపత్రిలో అందుబాటులో ఉంచిందన్నారు. గుండెపోటు లక్షణాలు కనిపించిన వారిలో ముఖ్యంగా ఛాతీ నొప్పి వచ్చిన గంట వ్యవధిలోపు ఆసుపత్రికి తీసుకువచ్చినట్లయితే వైద్యులు ఈసీజీ పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ చేస్తారన్నారు. గుండె పోటుగా నిర్ధారణ అయిన వారికి ఇంజక్షన్ ఉచితంగా ఇవ్వడమే కాకుండా, మెరుగైన వైద్య సేవల కోసం ప్రత్యేక అంబులెన్స్‌లో వైద్యుల పర్యవేక్షణలో విజయవాడకు తరలిస్తారన్నారు. గుండెపోటు సంభవించిన వారిని ప్రాణాపాయం నుంచి కాపాడటానికి ఈ ఇంజక్షన్ ఎంతో దోహదం చేస్తుందని చెప్పారు. గూడూరు ఆసుపత్రిలో ఏర్పాటు చేసిన స్టెమీ సేవలు 24 గంటలూ అందుబాటులో ఉంటాయన్నారు. పరిసర ప్రాంతాల ప్రజలు దీనిని సద్వినియోగించుకోవాలని ఆయన కోరారు. కార్యక్రమంలో వైద్యులు డాక్టర్ ఎం.కె.అహ్మద్ ఖాన్, హరిరంగ ప్రసాద్, ఇనాయత్ అలీ, పి.భాస్కర్, దుత్తా భారతి, సిబ్బంది పాల్గొన్నారు.

సహృదయులు ముందుకు రావాలి

కలెక్టర్ డీకే బాలాజీ



బాలుడి దత్తత పత్రాన్ని దంపతులకు అందజేస్తున్న కలెక్టర్ బాలాజీ, ఇతర అధికారులు

చిలకలపూడి(మచిలీపట్నం): అనాథ పిల్లలకు కొత్త జీవితాన్ని అందించేందుకు సహృదయులు ముందుకు రావాలని కలెక్టర్ డీకే బాలాజీ పిలుపునిచ్చారు. కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో బుధవారం మచిలీపట్నంలోని శిశుగృహాలో ఉంటున్న బాలుడిని సెంట్రల్ అడాప్షన్ రిసోర్స్ అథారిటీ ద్వారా జిల్లా బాలల రక్షణ విభాగం (డిస్ట్రిక్ట్ చైల్డ్ ప్రొటక్షన్ యూనిట్) ఆధ్వర్యంలో నెల్లూరు జిల్లా వాసులు నోటం రవి, ఉషా దంపతులకు దత్తతనిచ్చారు. అనంతరం కలెక్టర్ వారితో మాట్లాడుతూ బాలుడిని బాగా చూసుకుని మంచిగా చదివించాలన్నారు. దత్తత తీసుకునేందుకు ముందుకు వచ్చిన దంపతులను ఆయన అభినందించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ పీడీ ఎంఎన్ రాణి, డీసీపీవో మోనిషా, సీడబ్ల్యూసీ చైర్‌పర్సన్ సువార్త, పీవో ప్రశాంతి, సీడీపీవో విజయలక్ష్మి పాల్గొన్నారు.

దివ్యజ్ఞాన సమాజం అధ్యక్షునిగా లంకిశెట్టి బాలాజీ



దివ్యజ్ఞాన సమాజ నూతన అధ్యక్షుడు బాలాజీని అభినందించిన సభ్యులు

మచిలీపట్నంటౌన్: దివ్యజ్ఞాన సమాజం మచిలీపట్నం శాఖ నూతన అధ్యక్షునిగా సీనియర్ న్యాయవాది లంకిశెట్టి బాలాజీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. స్థానిక ఈడేపల్లిలోని దివ్యజ్ఞాన సమాజం భవనంలో బుధవారం జరిగిన జనరల్ బాడీ సమావేశంలో నూతన కార్యవర్గ ఎన్నిక జరిగింది. గౌరవ అధ్యక్షుడిగా సీనియర్ ఆడిటర్ సి.శేషాచార్యులు (అప్పాజీ)ని ఎన్నుకున్నారు. నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన లంకిశెట్టి బాలాజీ మాట్లాడుతూ నేటి సమాజంలో ఉన్న పరిస్థితుల దృష్ట్యా దివ్యజ్ఞాన సమాజం సిద్ధాంతాలు అత్యంత అవసరమని అన్నారు. చలసాని సుబ్బారావు, డాక్టర్ కుప్ప వెంకటరామశాస్త్రి, వేమూరి నరసింహారావు, ఎంవీ సుబ్బారావు, వంటి నగర ప్రముఖులు ఈ సమాజానికి సేవలు అందించారని తెలియజేశారు. సంస్థకు చెందిన విలువైన ఆస్తులు ఇతరుల చేతులలో ఉన్నాయని, వాటిని తిరిగి తీసుకోవడం కోసం చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. కార్యక్రమంలో కార్యదర్శి కొత్త గుండు రమేష్, కోశాధికారి ఎం.సత్యనారాయణ, హిందూ కాలేజీ విశ్రాంత అధ్యాపకులు సవరం వెంకటేశ్వరరావు, న్యాయవాది గుడిసేవ మురళీధర్, కార్యవర్గ సభ్యులు ఎంఎస్‌వీ ప్రసాద్, వై.చలపతిరావు, ఎస్.నాగమల్లేశ్వరమ్మ, ఎస్.విజయ చాముండేశ్వరి తదితరులు పాల్గొన్నారు.

అడంగల్‌లో పేరు మార్చేశారు!

న్యాయం చేయాలంటూ తహసీల్దార్, ఎస్‌ఐలకు బాధితురాలి ఫిర్యాదు

నాగాయలంక: ఓ భూ లబ్ధిదారుకు సంబంధించిన అసైన్డు భూమిపై ఓ పక్క సివిల్ కోర్టులో దావా నడుస్తుండగా కోర్టు తుది తీర్పుతో సంబంధం లేకుండా భూమి రికార్డుల అడంగల్‌లో అనుభవదారుగా రెవెన్యూ సిబ్బంది వేరే వారి పేరు ఎక్కించేశారు. దీనిపై బాధితురాలు తలగడదీవి వెంకట పద్మావతి, వెంకట దుర్గాప్రసాద్ దంపతులు తమకు న్యాయం చేయాలని కోరుతూ బుధవారం తహసీల్దార్ ముప్పిరిశెట్టి హరనాథ్, ఎస్‌ఐ కె.రాజేష్‌లకు ఫిర్యాదు చేశారు. బాధితురాలు పద్మావతి ఫిర్యాదులో పేర్కొన్న వివరాలు ఇలా ఉన్నాయి.. మండలంలోని పర్రచివర రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.388–3 ఎసైన్డ్ భూమి ఒక ఎకరం ప్రభుత్వం పేద బ్రాహ్మణ కుటుంబానికి చెందిన లబ్ధిదారు పద్మావతికి 2010లో పట్టా మంజూరు చేశారు. అయితే ఈ భూమిని 2018లో సమీప రైతులు కబ్జా చేశారు.అధికారులు,పెద్దల చుట్టూ తిరిగినా ఫలితం లేక పద్మావతి 2022లో అవనిగడ్డ సివిల్ కోర్టులో దావా(సిసి 35–2022)వేశారు. అనంతరం 2024 ఫిబ్రవరిలో అప్పటి జిల్లా కలెక్టర్‌ను సదరు భూమిని సర్వే చేయించమని కోరగా పర్రచివర రెవెన్యూ పరిధిలో భూమి తలగడదీవి వెంకట పద్మావతి పేరు మీదనే రికార్డులలో ఉన్నదని, ఇది కోర్టు పరిధిలో ఉన్నందున కోర్టు తుది తీర్పు రావలసి ఉందని సర్వే అధికారులు కలెక్టర్‌కు నివేదించారు. ప్రభుత్వ రికార్డులలో తమ పేరే ఉండటంతో భూమిపై పాస్‌బుక్‌లతో బ్యాంకులలో రుణాలు కూడా పొందుతున్నట్టు పద్మావతి తెలిపారు. ఎందుకైనా మంచిదని గత ఏడాది డిసెంబరు 30న సమాచార హక్కు చట్టం కింద సదరు భూమి రికార్డుల నమోదు వివరాలు కోరగా, ఈ ఏడాది జనవరి 27న సమాధానం ఇస్తూ ప్రభుత్వం ఎసైన్డ్ భూమి ఎవరూ కొనుగోలు చేయరాదని, ప్రస్తుతం వేబ్లాండ్‌లో పద్మావతి పేరే నమోదయి ఉందని ధ్రువీకరించారు. కానీ సమాధానంతో పాటు జతపర్చిన అడంగల్ కాపీలో మాత్రం అనుభవదారుగా సబ్బినేని నాగమల్లేశ్వరరావు(తండ్రి రంగారావు) పేరుతో ఉండటం గమనార్హం. గతంలో విధి నిర్వహణలో అక్రమాలకు పాల్పడి సస్పెండ్ అయిన వీఆర్వో ప్రభుత్వ రికార్డులలో తమ పేర్లు తారుమారు చేశారని, ఆయనపై చట్టపరంగా చర్యలు తీసుకుని, అడంగల్‌లో నాగమల్లేశ్వరరావు పేరు తొలగించి తమకు న్యాయం చేయాలని పద్మావతి కోరారు.

నేడు సింధుస్నానాలపై సమీక్ష సమావేశం

కోడూరు: మాఘపౌర్ణమిని పురస్కరించుకుని ఈ నెల 12న హంసలదీవి సాగరతీరంలో నిర్వహించే సింధుస్నానాల ఏర్పాట్లపై గురువారం ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించనున్నట్లు తహసీల్దార్ శ్రీనునాయక్ బుధవారం తెలిపారు. ఉదయం 11 గంటలకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో బందరు ఆర్డీఓ అధ్యక్షతన ఈ సమావేశం ఉంటుందన్నారు. హంసలదీవి వేణుగోపాలస్వామివారి కల్యాణోత్సవాలతో పాటు సింధుస్నానాలకు పర్యాటకులకు కల్పించాల్సిన వసతులపై చర్చించనున్నట్లు చెప్పారు. అన్ని శాఖల అధికారులు విధిగా హాజరుకావాలని తహసీల్దార్ కోరారు.

500 కేజీల వానపాములు వదిలిన అధికారులు

నాగాయలంక: స్థానిక పంచాయతీ పరిధిలోని చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం వర్మిపిట్స్‌లో 500 కేజీల వానపాములను వదిలి వర్మీ కంపోస్ట్ ప్రాసెస్‌ను ఎంపీడీఓ జె.సీతారామ్‌కుమార్, ఈఓపీఆర్‌డీ కె.అప్పలనరసమ్మ బుధవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె పారిశుద్ధ్య సేకరణపై పంచాయతీ కార్యదర్శులకు పలు సూచనలు చేశారు.

చౌడేశ్వరిదేవీ ఉత్సవాలకు ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు

పెడన: పట్టణంలో జరగనున్న శ్రీమత్ చౌడేశ్వరీదేవి మహోత్సవాలకు పురపాలక సంఘం ఆధ్వర్యంలో ప్రత్యేక పారిశుద్ధ్య చర్యలు చేపట్టడానికి అవసరమైన చర్యల కోసం కౌన్సిల్ అత్యవసర సమావేశాన్ని ఏర్పాటు చేశామని మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి అన్నారు. మున్సిపల్ కార్యాలయంలో బుధవారం చైర్‌పర్సన్ నాగకుమారి అధ్యక్షతన కౌన్సిల్ అత్యవసర సమావేశం నిర్వహించారు. అజెండాలోని నాలుగు అంశాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. సున్నం, బ్లీచింగ్ స్టాకు అయిపోవడంతో తక్షణం కొనుగోలు చేయాల్సి రావడం, టెండర్లు పిలిచి తక్కువ టెండరుదారునికి అప్పగించడం వంటి అంశాలను ఆమోదించారు. పట్టణంలో జరగనున్న చౌడేశ్వరీదేవి మహోత్సవాలకు ప్రత్యేకంగా పారిశుద్ధ్య సిబ్బందితో పాటు చెత్త సేకరణకు రెండు ట్రాక్టర్లు 14 రోజులకు అద్దె ప్రాతిపదికన ఏర్పాటు చేసుకోవడానికి కౌన్సిల్ ఆమోదించింది. సమావేశంలో సీనియర్ కౌన్సిలర్లు కటకం ప్రసాద్, గరికిముక్కు చంద్రబాబు, పిచ్చిక సతీష్‌బాబు, కమిషనర్ గోపాలరావు, టీపీవో సుజనాకుమారి, కౌన్సిల్ సభ్యులు, ఆయా విభాగాలకు చెందిన మున్సిపల్ అధికారులు పాల్గొన్నారు.



కౌన్సిల్ సమావేశంలో మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ కటకం నాగకుమారి

పొంగిపొర్లిన ప్రధాన డ్రెయిన్

ఇబ్బంది పడిన నగర ప్రజానీకం

మచిలీపట్నంటౌన్: నగరంలోని ప్రధాన రహదారి వెంబడి ఉన్న డ్రెయిన్ బుధవారం పొంగిపొర్లింది. వర్షం కురిస్తే రోడ్డు మార్జిన్లు ముంపునీటితో ఎలా దర్శనమిస్తాయో అదే మాదిరిగా మురుగునీరు రోడ్లపైకి పొంగాయి. డ్రెయిన్‌లో సిల్ట్ పెద్ద ఎత్తున పేరుకుపోవటంతో మురుగునీటి పారుదలకు ఇబ్బంది ఏర్పడుతోంది. దీంతో మురుగునీరు పొంగిపొర్లి ప్రధాన రోడ్డుపైకి చేరాయి. దీంతో ఆ రోడ్డులో ప్రయాణించే వారు ఈ నీటి నుంచి వచ్చిన దుర్వాసనతో తీవ్ర ఇబ్బంది పడ్డారు. స్థానిక రేవతి థియేటర్ సెంటర్ నుంచి బస్టాండ్ సెంటర్ వరకూ డ్రెయిన్‌లోని నీరు రోడ్డుపైకి పొంగాయి. రేవతి థియేటర్ సెంటర్ నుంచి ఈడేపల్లి వైపు, బస్టాండ్ సెంటర్ నుంచి ఈడేపల్లి ఆంజనేయస్వామి ఆలయం వైపు రోడ్డులో వెళ్లే వాహనదారులు, పాదచారులు ఇబ్బందుల పాలయ్యారు. డ్రెయిన్‌లలో సిల్ట్‌ను తీయించటంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తుండటంతోనే నగరంలోని పలు ప్రాంతాల్లో డ్రెయిన్‌లలోని మురుగునీరు రోడ్లపైకి పారుతున్నాయని ప్రజలు ఆరోపిస్తున్నారు.



రేవతి థియేటర్ సెంటర్‌లో ప్రధాన రహదారిపై పొంగి ప్రవహిస్తున్న మురుగునీరు

రోడ్లపైనే ధాన్యం లోడులు



స్వతంత్రపురం సమీపంలో వేచి ఉన్న ధాన్యం లోడు ట్రాక్టర్లు

కోడూరు: ప్రభుత్వం రైతుల నుంచి కొనుగోలు చేస్తున్న ధాన్యం లోడ్లు రైస్‌మిల్లులు ఖాళీ లేకపోవడంతో రోడ్ల వెంబడే నిలుపుదల చేస్తున్నారు. కోడూరు మండలంలోని స్వతంత్రపురం సమీపంలో ఉన్న రెండు రైస్‌మిల్లులతో ప్రభుత్వం ధాన్యం కొనుగోలుకు ఒప్పందం చేసుకుంది. అయితే దివిసీమలోని కోడూరు, నాగాయలంక మండలాల్లో తీరప్రాంత గ్రామాల్లో వరిపంటను రైతులు యంత్రాల సహాయంతో కోసి ధాన్యాన్ని సమీప ప్రభుత్వ విక్రయ కేంద్రాల వద్ద విక్రయించారు. ఆ విక్రయ కేంద్రాల నుంచి ధాన్యం లోడ్లు ప్రస్తుతం స్వతంత్రపురం సమీపంలోని రైస్‌మిల్లుల వద్దకు చేరుతున్నాయి. అయితే రైస్‌మిల్లుల్లో ఇప్పటికే ధాన్యం నిల్వలు పూర్తిస్థాయిలో ఉండడంతో ప్రస్తుతం కొత్తగా వచ్చే ధాన్యం లోడ్లను దింపే అవకాశం లేకుండా పోయింది. మంగళ, బుధవారాల్లో నాగాయలంక మండలం నుంచి భారీ మొత్తం ధాన్యం లోడ్లు రావడంతో అవి మొత్తం మిల్లు సమీపంలోని కోడూరు–ఉల్లిపాలెం రహదారి వెంబడే ఉంచారు. సుమారు 40కు పైగా ట్రాక్టర్లు, లారీల్లో ధాన్యం లోడ్లు రహదారిపై వేచి ఉన్నాయి. మిల్లుల్లో ఉన్న ధాన్యం నిల్వలు ఖాళీ అయిన తరువాత వీటిని అన్‌లోడ్ చేసే అవకాశాలు ఉన్నట్లు తెలుస్తోంది.

ఉత్కంఠ పోరులో వాలీబాల్ విజేతగా మాట్లం



సెంట్రల్ జోన్ జూనియర్స్ త్రోబాల్ ట్రోఫీ అందిస్తున్న అతిథులు



సెంట్రల్ జోన్ కబడ్డీ విజేత మాజేరు హైస్కూల్ విద్యార్థులకు ట్రోఫీ అందిస్తున్న అతిథులు

గోగినేనిపాలెం(ఘంటసాల): గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్ ప్రాంగణంలో జరుగుతున్న 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ జోన్ పోటీలు రెండో రోజు బుధవారం ఉత్కంఠగా సాగాయి. ఈ పోటీల్లో వాలీబాల్ సీనియర్స్ విభాగంలో విజేతగా మాట్లం జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా మచిలీపట్నం పాండురంగ మున్సిపల్ హైస్కూల్ నిలిచినట్లు హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, సెంట్రల్ జోన్ ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి మారుతీ ప్రసాద్ తెలిపారు. సీనియర్స్ విభాగంలో కబడ్డీ విన్నర్‌గా అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా మొవ్వ జెడ్పీ హైస్కూల్, బాల్ బ్యాడ్మింటన్, ఖోఖో పోటీల్లో కప్పలదొడ్డి జెడ్పీ హైస్కూల్ విన్నర్‌గా, లింగారెడ్డిపాలెం జెడ్పీ హైస్కూల్ రన్నర్ గా, సాఫ్ట్‌బాల్ విన్నర్‌గా గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా గూడూరు జెడ్పీ హైస్కూల్, త్రో బాల్ విన్నర్‌గా గొడవర్రు హైస్కూల్, రన్నర్‌గా తరకటూరు జెడ్పీ హైస్కూల్, చెస్ విన్నర్‌గా అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా వీరవల్లి జెడ్పీ హైస్కూల్, టెన్నికాయిట్ విన్నర్‌గా మోపిదేవి ఆశ్రమం జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా గొడవర్రు జెడ్పీ హైస్కూల్, షటిల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా పెనమలూరు జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా మల్లవురాజుగూడెం జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచారు.

జూనియర్స్ విభాగంలో...

కబడ్డీ విజేతగా మాజేరు జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా గన్నవరం జెడ్పీ హైస్కూల్ (బోయ్స్), బాల్ బ్యాడ్మింటన్ విన్నర్‌గా రాయవరం జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా చిలకలపూడి జెడ్పీ హైస్కూల్, ఖోఖో విన్నర్‌గా గుడివాడ జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా భట్ల పెనుమర్రు జెడ్పీ హైస్కూల్, సాఫ్ట్‌బాల్ విన్నర్‌గా గోగినేనిపాలెం జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా పామర్రు జెడ్పీ హైస్కూల్, త్రో బాల్ విన్నర్‌గా గొడవర్రు జెడ్పీ హైస్కూల్, రన్నర్స్‌గా తరకటూరు జెడ్పీ హైస్కూల్, వాలీబాల్ విన్నర్‌గా గుడ్లవల్లేరు జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా గిలకలదిండి జెడ్పీ హైస్కూల్, చెస్ విన్నర్‌గా అవనిగడ్డ జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా గిలకలదిండి జెడ్పీ హైస్కూల్, టెన్నికాయిట్ విన్నర్‌గా మోపిదేవి ఆశ్రమం జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా కానూరు జెడ్పీ హైస్కూల్, బ్యాడ్మింటన్ విన్నర్‌గా పెనమలూరు జెడ్పీ హైస్కూల్, రన్నర్‌గా కోడూరు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు నిలిచినట్లు నిర్వాహకులు తెలిపారు. అనంతరం అథ్లెటిక్స్ పోటీల్లో భాగంగా రన్నింగ్, జంపింగ్, త్రోయింగ్ విభాగాల్లో వివిధ రకాల పోటీలను హెచ్‌ఎం తమ్మన వేణుగోపాలరావు, పూర్వ విద్యార్థి లాన్ టెన్నిస్ జాతీయ కోచ్ అన్నే రత్నాకర్ ప్రారంభించారు. ఆయా పోటీలను సెంట్రల్ పోటీల ఆర్గనైజింగ్ సెక్రటరీ గరికపాటి మారుతీ ప్రసాద్ పర్యవేక్షణలో కృష్ణాజిల్లా వ్యాయామ ఉపాధ్యాయ సంఘం అధ్యక్ష, కార్యదర్శులు కొడాలి మాసిలామణి, సింహాద్రి గంగాధర్, ఇతర వ్యాయామ ఉపాధ్యాయులు నిర్వహించారు.

విజేతలకు బహుమతి ప్రదానం

గోగినేనిపాలెం(ఘంటసాల): కృష్ణాజిల్లా స్థాయి 84వ గ్రిగ్ మెమోరియల్ బాలుర సెంట్రల్ ఆటల పోటీల్లో విజేతలకు బుధవారం రాత్రి బహుమతి ప్రదానోత్సవం జరిగింది. వివిధ పోటీల్లో విజేతలకు యువనేత మండలి వెంకట్రామ్, లాన్ టెన్నిస్ జాతీయ కోచ్ అన్నే రత్నాకరరావు, జాతీయ ఖోఖో అంపైర్ మడకా ప్రసాద్, దాతలు ఎన్నారై పిన్నమనేని లెనిన్, లయన్ ఘట్టమనేని బాబూరావు, గుత్తికొండ సుభాష్ చంద్రబోస్, పరుచూరి సుభాష్ చంద్రబోస్, అత్తలూరి గోపీచంద్ బహుమతులు అందించారు.

సినీ ఫక్కీలో చోరీ

కారు అద్దాలు బద్దలుగొట్టి రూ.3 లక్షలు అపహరణ

కోనేరుసెంటర్: మచిలీపట్నంలో గుర్తు తెలియని దుండగులు కారు అద్దాలు బద్దలుగొట్టి సినీఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు బుధవారం కేసు నమోదు చేసిన మచిలీపట్నం పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఎస్‌ఐ ప్రభాకరరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. మచిలీపట్నంలోని కొబ్బరితోటకు చెందిన చలమలశెట్టి సుధాకర్ హైదరాబాద్‌లో ఉంటున్నారు. మాచవరంలోని తన 300 గజాల స్థలాన్ని ఇటీవల మచిలీపట్నంకు చెందిన పెదశింగు నాగేశ్వరరావుకు విక్రయించారు. సదరు స్థలం రిజిస్ట్రేషన్ నిమిత్తం సుధాకర్ బుధవారం మచిలీపట్నం వచ్చారు. రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ పనుల నిమిత్తం కార్యాలయంలోని సిబ్బందితో మాట్లాడుతుండగా గుర్తు తెలియని ఇరువురు బైక్‌పై వచ్చి సుధాకర్ కారు అద్దాలు బద్దలుకొట్టి బ్యాగులో ఉన్న మూడు లక్షల రూపాయలను అపహరించుకుపోయారు. చోరీ జరుగుతున్నట్లు స్థానికులు గ్రహించేలోగా దుండగులు బైక్‌పై ఉడాయించారు. విషయం తెలుసుకున్న సుధాకర్ జరిగిన విషయాన్ని మచిలీపట్నం పోలీసులకు వివరించి ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

నేడు మున్సిపల్ కౌన్సిల్ సమావేశం

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం నగరపాలక సంస్థ పాలకవర్గ సాధారణ సమావేశం ఈ నెల 6వ తేదీ గురువారం ఉదయం 11 గంటలకు నిర్వహిస్తున్నట్లు మేయర్ చిటికిన వెంకటేశ్వరమ్మ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం స్థానిక క్యాటిల్ డిపో వద్ద ఉన్న కౌన్సిల్ హాల్లో జరుగుతుందన్నారు. సమావేశంలో అజెండాలో పొందుపర్చిన రెండు అంశాలపై చర్చించి తీర్మానం చేయనున్నట్లు ఆమె తెలిపారు. ఈ సమావేశానికి కార్పొరేటర్‌లు, కోఆప్షన్ సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని ఆమె కోరారు.

వరిగడ్డి ట్రక్కు పల్టీ



కొడాలి(ఘంటసాల): మండలంలోని కొడాలి గ్రామంలో పెట్రోల్ బంక్ దాటిన తర్వాత ప్రధాన రహదారిపై బుధవారం రాత్రి వరిగడ్డి ట్రక్కు పల్టీ కొట్టడంతో ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. సుమారు గంటకు పైగా ట్రాఫిక్ నిలిచిపోయింది. రెండు వైపులా భారీగా వాహనాలు నిలిచిపోవడంతో ప్రజలు, ప్రయాణికులు, వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు.